ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 23 సెప్టెంబరు 2025



## ఘనంగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రులు

- వాడవాడన వెలిసిన మండపాలు... పెరిగిన మాలధారణ భక్తులు
- బాల త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు..

8



బాల త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు

## నేషనల్ హైవే నిర్మాణానికి భూ సేకరణ పూర్తి చేయాలి

పెద్దపల్లి, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణానికి గడువులోగా భూ సేకరణ పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర సీఎస్ కె రామకృష్ణారావుతో కలిసి జాతీయ రహదారుల నిర్మాణంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ విజయవాడ ఎన్‌హెచ్ 65ఆరులైన్ల విస్తరణ, హైదరాబాద్ నుంచి అమరావతి, మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్ డిండి 764 నాలుగు లైన్ల విస్తరణ, ఎన్‌హెచ్ 163 మన్నెగూడ సెక్షన్ 4లైన్ల విస్తరణ, హైదరాబాద్ మంచిర్యాల కారిడార్ 4 లైన్‌లో గ్రీన్ ఫీల్డ్ హైవే కారిడర్‌కు అవసరమైన భూసేకరణ వివరాలు తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. జాతీయ రహదారులకు మొదటి ప్రాధాన్యతగా భూ సేకరణ పూర్తి చేయాలని అన్నారు. ఎన్‌హెచ్ 163జి పరిధిలో పెండింగ్‌లో ఉన్న 130హెక్టార్ల భూ బదలాయింపు ప్రక్రియ ప్రాధాన్యం క్రమంలో పూర్తి చేయాలని, ఈ రోడ్డు పరిధిలో ఉన్న కలెక్టర్లు ప్రత్యేకంగా ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తూ భూ బదలాయింపు వేగవంతం చేయాలని, ఆర్డీవో స్థాయి అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు. భూ సేకరణ ప్రక్రియలో కలెక్టర్‌లు నేరుగా రైతులతో చర్చించాలని, వారికి జాతీయ రహదారుల అథారిటీ ద్వారా మెరుగైన పరిహారం అందించేందుకు కృషి చేస్తున్నామని భరోసా కల్పించాలని అన్నారు. జాతీయ రహదారులనిర్మాణంలో కోల్పోతున్న అటవీ శాఖ భూములకు ప్రత్యామ్నాయ భూములు గుర్తించి అడవుల పెంపకం పనులు ప్రారంభించాలని, అటవీశాఖ ద్వారా అవసరమైన అనుమతులు త్వరగా సాధించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీహర్ష, డీఎస్‌ఓ శివయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# సింగరేణి కార్మికులకు దసరా జోష్..

- 2024-25 లాభాల్లో 34శాతం వాటా
- లాభాలు రూ.2360కోట్లు
- కార్మికుల వాటా రూ.819కోట్లు...
- కాంట్రాక్టు కార్మికులకు రూ.5500 బోనస్
- ప్రతి కార్మికునికి సగటు రూ.1.95లక్షల ప్రయోజనం

గోదావరిఖని, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సింగ రేణి సంస్థ తన లాభాల నుంచి కార్మికులకు 34శాతం వాటాను పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సచివాలయంలో ప్రకటన చేశారు. సింగరేణి సంస్థ 2024-25 ఆర్థిక సంవ త్సరంలో రూ.6,394కోట్లు లాభాలు ఆర్జించిందని, కొత్త ప్రాజెక్టుల కోసం రూ.4034కోట్లు కేటాయించగా మిగి లిన లాభం రూ.2360కోట్లలో 34శాతం కార్మికులకు లాభాల వాటా కింద దసరా ముందు పంపిణీ చేయ నున్నారు. అంటే రూ.819కోట్లు సింగరేణి సంస్థ కార్మికు లకు గడిచిన ఆర్థిక సంవత్సరం లాభాల నుంచి వాటా చెల్లిస్తున్నది. సింగరేణిలోని 41వేల మంది కార్మికులకు ఈ లాభాల వాటా సగటున ఒక్కొక్కరికి రూ.1,95,610 మేర ప్రయోజనం జరుగనున్నది. గత ఏడాది లాభాల వాటాతో పోల్చితే సగటున ఒక్కొక్క ఉద్యోగికి 4.4శాతం అదనంగా ఈయేడు లాభాల వాటా వస్తున్నది. అంటే ప్రతి ఉద్యోగికి రూ.8289 అదనంగా వాటా లభించను న్నది. గత సంవత్సరం సగటున ఒక్కో కార్మికుడికి రూ.1,87,321 లాభాల బోనస్ సింగరేణి చెల్లించింది. ఈ యేడు రూ.1,95,610 సగటున చెల్లిస్తున్నది. అంతే కాకుండా సింగరేణిలో పని చేస్తున్న 30వేల మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్ చెల్లిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గత సంవత్సరమే ప్రారం భమైన కాంట్రాక్టు కార్మికుల బోనస్ ఈ సంవత్సరం రూ.500 పెరిగింది. గడిచిన కార్మికులకు రూ.5వేల బోనస్ చెల్లించారు. ఈ లాభాల వాటాను దసరా కంటే ముందే సింగరేణి యాజమాన్యం కార్మికుల ఖాతాల్లో జమ చేయనున్నది. కార్మికుల మస్టర్లను పరిగణలోకి తీసుకుని వాటా చెల్లిస్తారు. దసరా పండుగ అక్టోబరు 2న ఉన్న నేపథ్యంలో ఈ నెల 30లోపే కార్మికులకు ఈ వాటా అందజేయనున్నారు. దీనికి తోడు దసరా అడ్వా న్స్ రూ.25వేలను కూడా సింగరేణి యాజమాన్యం వారం రోజులలోపే కార్మికుల ఖాతాల్లో జమ చేసే అవకాశం ఉంది.

**పదేళ్లుగా లాభాల వాటా ప్రస్థానం...**

| సంవత్సరం | లాభాలు(కోట్లలో) | కార్మికులకు పంపిణీ చేసిన శాతం |
|---|---|---|
| 2017-18 | రూ.1200 | 27శాతం |
| 2018-19 | రూ.1765 | 28శాతం |
| 2019-20 | రూ.999 | 28శాతం |
| 2020-21 | రూ.273 | 29శాతం |
| 2021-22 | రూ.1227 | 30శాతం |
| 2022-23 | రూ.2222 | 32శాతం |
| 2023-24 | రూ.2412 | 33శాతం |
| 2024-25 | రూ.2360 | 34శాతం |

### ● రూ.2000 నుంచి మొదలు...

సింగరేణి కార్మికులకు రూ.2000 లాభాల వాటాతో ప్రారంభమైన ప్రస్తానం 25సంవత్సరాల్లో రూ.2లక్షల వరకు చేరింది. సింగరేణి సంస్థ వరుసగా తన ఉత్పత్తి లక్ష్యాలను పెంచుకుంటూ వరుస లాభాలను ఆర్జిస్తు న్నది. ఈ లాభాలకు కార్మికవర్గమే కారణం కావడంతో కార్మికుల వాటాను పెంచుకుంటూ వస్తున్నది. ఏ ప్రభుత్వరంగ సంస్థలో కార్మికులకు సరాసరిన లాభాల్లో వాటా ఇచ్చే పరిస్థితి లేదు. ఉత్పత్తి,

(మిగతా 8వ పేజీలో)



లాభాల వాటా చెక్కును ముఖ్యమంత్రితో కలిసి విడుదల చేస్తున్న సీఎండీ బలరాంనాయక్

### నికర లాభాల నుంచి చెల్లించాలి...

● కార్మిక సంఘాల డిమాండ్

కార్మికులకు లాభాల్లో 34శాతం వాటా ప్రకటనపై పెద్దగా అభ్యంతరం తెలుపని కార్మిక సంఘాలు సింగ రేణి నికర లాభాలను ప్రకటించే విషయంలో మాత్రం యాజమాన్యం కార్మికులను వంచించిందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, జాతీయ కార్మిక సంఘం బీఎంఎస్, తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం సింగరేణి కార్మికుల లాభాల వాటా ప్రకటనపై పెదవి విరుస్తు న్నాయి. 2024-25 సంవత్సరం రూ.6394కోట్లు నికర లాభాలు ప్రకటించిన సింగరేణి యాజమాన్యం రూ.4034 కోట్లను భవిష్యత్ అవసరాల కోసం పక్కన పెట్టడం సరైంది కాదని కార్మిక సంఘాలు వాదిస్తు న్నాయి. గత సంవత్సరం కూడా యాజమాన్యం ఇదే మోసపూరిత పద్ధతిని అవలంబించిందని వారంటు న్నారు. సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలు రూ.6394 కోట్ల నుంచి 34శాతం కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. 34శాతం వాటా అంటూ చెప్పుకుంటున్న ప్రభుత్వం, యాజమాన్యం అసలు లాభాల్లో నుంచి లెక్క చూస్తే కేవలం 12.8శాతం మాత్రమే కార్మికులకు లాభాల వాటా అందుతున్నదని సంఘాలు ఆరోపిస్తు న్నాయి. 2023-24ఆర్థిక సంవత్సరం విస్తరణ పేరిట రూ.2289 కోట్లను పక్కన పెట్టామని చెప్పి వాటిని ఎక్కడ ఖర్చు చేశారో స్పష్టత ఇవ్వకుండా ఈ ఆర్థిక సం వత్సరం రూ.4034కోట్లను కూడా భవిష్యత్ అవసరాల పేర లాభాల నుంచి వేరు చేయడం కార్మికులను మోసం చేయడమేనని సంఘాలంటున్నాయి.

### కార్మికుల రుణం తీర్చుకుంటున్న కాంగ్రెస్

- లాభాల వాటా పెంపుపై ముఖ్యమంత్రికి ధన్యవాదాలు...
- ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్

8



### సింగరేణి కార్మికులను కాంగ్రెస్ మోసం చేసింది

- రూ.6394కోట్లలో 34శాతం వాటా ఇవ్వాలి...
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

8



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

## డ్రగ్స్ రహిత సమాజంగా యువత నిలువాలి

● ఖనిలో నమో మారథన్ యువ భారత్ ర్యాలీ




జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమళ్ళ మహేష్ పిలుపునిచ్చారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నమో మారథన్ యువ భారత్ ర్యాలీని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి గోదావరిఖని చౌరస్తా వరకు నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో యువత సేవా భావం వైపు అడుగులు వేయాలని, తద్వార డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించ వచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండపర్తి సంజీవ్, గుండబోయిన భూమయ్య, అపర్ణ, పవన్, నర్సయ్య, రమేష్, శివరాంకృష్ణ, రాజ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● సైబర్ వారియర్స్‌తో సమావేశం నిర్వహించిన సీపీ

కోల్‌సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సైబర్ నేరాలపై వారి యర్స్ అవగాహన కల్పించాలని రామ గుండం సీపీ అంబర్‌కిశోర్ ఝా సూచించారు. సోమవారం కమిషనరేట్‌లో సైబర్ వారియర్స్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరా లు వేగంగా పెరుగుతున్న క్రమంలో సైబర్ క్రైమ్ సెక్యూరిటీపై అవగా హన కల్పించడం ఎంతో ముఖ్యమని, ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో అవగాహన కల్పించి చైత న్యం తీసుకురావాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం లేకుండా విచారణ నిర్వహించి సైబర్ బాధితులకు న్యాయం చేసే విధంగా కృషి చేయాలని, రామగుండం కమిషనరేట్ పరిధిలో ఇటీవల నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 134సైబర్‌కేసుల్లో రూ.41.81లక్షల ను బాధితులకు ఇప్పించామన్నారు. కేసులను చేధించి రిఫండ్‌అయ్యేలా కృషిచేసిన నలుగురు సైబర్‌వారియర్ పోలీస్‌కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలతో టీజీసీఎస్‌బీ హైదరాబాద్ వారు పంపించిన టీ షర్టులను అంద జేశారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీసీపీఎస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, సీసీ హరీష్, సైబర్ వారియర్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి ప్రశంసా పత్రాలు, టీ షర్టులు అందజేస్తున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

### జీఎస్టీ తగ్గింపుపై

## మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

పెద్దపల్లి టౌన్, 22 (ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలో కొత్త శకానికి శ్రీకారం చుట్టుతూ ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ తగ్గింపు నిర్ణయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపుపై జెండా చౌరస్తాలో సోమవారం ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మౌట్టం నర్సింగం అక్కేపల్లి క్రాంతి కుమార్ శివంగారి సతీష్ మొర మనోహర్ పెండ్యాల కరుణాకర్ సంతోష్ విజయ్ కృష్ణ రమేష్ వంశీ బండ కరుణాకర్ తిరుపతి సాగర్ వినయ్ అఖిల్ ప్రమోద్ సత్యం మల్లారెడ్డి అనుదీప్ రెడ్డి శంకర్ పాల్గొన్నారు




పెద్దపల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆంధ్రజ్యోతికి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
దేశ ప్రగతి ! పరిశ్రమ ప్రగతి !! కార్మిక ప్రగతి !!!



2027 మంచి వేతన సవరణకై
BMS ను గెలిపించండి
గులాబి పువ్వు
గుర్తుకు ఓటేద్దాం
స్థలం: అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్
Fast Track Pramotions, C.D.P. PRMS సాధనకై BMSను గెలిపిద్దాం
NTPC KARMIK SANGH (BMS) E - 533

## 'స్థానిక' రిజర్వేషన్లకు కసరత్తు

- 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు
- 2024 కులగణన ప్రకారం బీసీల రిజర్వేషన్లు
- రొటేషన్ పద్ధతిలోనే ఖరారు
- ఒకటి, రెండు రోజుల్లో రిజర్వేషన్లు సిద్ధం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు అధికారులు కసరత్తు ఆరంభించారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో ప్రభుత్వం జీవో విడుదల చేసి ఆ మేరకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఎస్సీ, ఎస్టీలకు ఎప్పటి లాగానే 2011 జనాభా లెక్కలను అనుసరించి, బీసీ రిజ ర్వేషన్లను 2024లో ప్రభుత్వం చేపట్టిన కులగణన లెక్కల ఆధారంగా బీసీల జనాభాను తీసుకుని చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం కలెక్టర్, అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారి, ఆర్‌డీఓలు, ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి పలు సూచనలు చేసినట్లు సమాచారం. మంగళవారం సాయంత్రం ప్రభుత్వానికి పంపించాల్సి ఉండడంతో కలెక్టరేట్‌లోనే రాత్రి వరకు అధికార యంత్రాంగం రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ చేపట్టారు. కులగణన సర్వే లెక్కలను ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టినప్పటికీ, జిల్లాల వారీగా లెక్కలను విడుదల చేయలేదు. అందులో జిల్లాల వారీగా తేలిన బీసీల జనాభా లెక్కలను ప్రభుత్వం జిల్లాలకు పంపించినట్లు తెలుస్తు న్నది. అయితే అధికారులు వాటి గురించి వెల్లడించడం లేదు. వాటి ఆధారంగానే బీసీల రిజర్వేషన్లు ఖరారు చేస్తున్నారు. ప్రభుత్వం ఒకటి, రెండు రోజుల్లో జీవో విడుదల చేయవచ్చనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఈ నెలాఖరు, వచ్చే నెల మొదటి వారంలో గ్రామ పంచాయతీల లేదా మండల, జిల్లా పరిషత్ ఎన్నికల షెడ్యూల్ ఏదో ఒకటి విడుదల చేసే



అవకాశాలున్నాయి. స్థానిక సంస్థలకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయమై ప్రభు త్వం తీసుకవచ్చిన ఆర్డినెన్స్‌లు, రెండు బిల్లులపై రాష్ట్రపతి ఆమోదం లభించలేదు. దీంతో జీఓ తీసుకవచ్చి ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నది.

### ● రొటేషన్ల ప్రకారమే రిజర్వేషన్లు...

రొటేషన్ల ప్రకారమే రిజర్వేషన్లు ప్రకటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2019లో జరిగిన పంచాయతీ, మండల, జిల్లాపరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్లను పదేళ్లకో సారి చేపట్టాలని చట్టంలో పేర్కొన్నారు. దానికి ప్రస్తుతం ప్రభుత్వం గతంలో వలే ఐదేళ్లకోసారి రిజర్వేషన్లు రొటేషన్ చేయాలని చట్ట సవరణ చేసింది. జిల్లాలో 263 గ్రామ పంచాయతీలు, 2,432 వార్డులు, 137 ఎంపీటీసీ స్థానాలు, 13 ఎంపీపీ, 13 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 4,04,181 మంది ఉండగా, ఇందులో పురుషులు 1,98,728 మంది, మహిళలు 2,05,438 మంది, ఇతరులు 14 మంది ఉన్నారు. చట్ట సవరణ చేయడం వల్ల గత ఎన్నికల్లో ఏదైతే రిజర్వేషన్ వచ్చిందో ఈసారి రాదు. ఉదా హరణకు సర్పంచ్ బీసీ జనరల్‌కు కేటాయిస్తే, ఈసారి బీసీ మహిళకు గానీ, ఇతర ఎస్సీ, ఎస్టీ వర్గాలకు గానీ, జనరల్ గానీ కేటాయించవచ్చు.

### ● రిజర్వేషన్లు ఇలా..

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లను ఆర్‌డీఓ ఖరారు చేస్తారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ముందుగా ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించి, బీసీ రిజర్వేషన్లను బీసీ జనాభా ప్రకారం తీస్తారు. మిగిలిన స్థానాలను జనరల్‌కు కేటాయిస్తారు. మహిళలకు 50 శాతం సీట్లను డ్రా ద్వారా ఎంపిక చేస్తారు. వార్డు స్థానాలకు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఎంపీడీఓలు నిర్ణయిస్తారు. రిజర్వేషన్లు ఖరారు చేయడంలో రొటేషన్‌ను అనుసరిస్తారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు నిర్ణయిం చారు. ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా ప్రకారం, బీసీలకు ఓటర్ల సంఖ్య ప్రకారం నిర్ణయించారు. ఎంపీటీసీ స్థానాలకు కూడా రిజర్వేషన్లను ఆర్‌డీఓ నిర్ణయిస్తారు. ఎంపీపీ, జడ్పీ టీసీ స్థానాలకు జిల్లాను యూనిట్‌గా తీసుకుని కలెక్టర్ ఖరారు చేయనున్నారు. జడ్పీ చైర్మన్ స్థానాలను రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 7,95,332 జనాభా ఉం డగా, పురుషులు 3,99,325 మంది, మహిళలు 3,96,007 మంది, ఎస్సీల జనాభా 1,54,855 మంది, పురుషులు 77,311 మంది, మహిళలు 77,544 మంది ఉన్నారు. ఎస్టీల జనాభా 14,945 మంది ఉండగా, పురుషులు 7,520 మంది, మహిళలు 7,425 మంది ఉన్నారు. ఈలెక్కల ప్రకారం ముందుగా ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. ప్రభుత్వం తీసుక వచ్చే జీఓ ప్రకారమే బీసీల జనాభా ఆధారంగా రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. జీఓపై ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే, కోర్టు దానిని నిలిపి వేస్తే మాత్రం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా చేసే అవకాశాలు న్నాయి. రిజర్వేషన్ల కోసం మండలాల వారీగా అధికార యంత్రాంగం కంప్యూటర్లలో నమోదు చేస్తున్నారు. రెండు రకాల రిజర్వేషన్లను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతికి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు..

THE KARIMNAGAR CO-OPERATIVE URBAN BANK LTD, KARIMNAGAR

(UNDER SECTION 29 OF B.R. ACT, 1949)

BALANCE SHEET AS ON 31-03-2025

| Sl. No. | LIABILITIES | Balance at the end of the 31/03/2025 | Balance at the end of the 31/03/2024 | Sl. No. | ASSETS | Balance at the end of the 31/03/2025 | Balance at the end of the 31/03/2024 |
|---|---|---|---|---|---|---|---|
| 1. | Paid on Share capital | 26,129,701-00 | 25,060,395-00 | 1. | Cash on Hand | 18,474,717.00 | 11,020,845.00 |
| 2. | Reserve Fund & Other Reserves | 136,074,756.51 | 112,584,599.79 | 2. | Current Accounts | 36,436,915.25 | 41,099,213.19 |
| 3. | Deposits and Other Accounts | 877,892,709.47 | 840,360,788.74 | 3. | Investments | 477,772,790.44 | 496,769,997.44 |
| 4. | Reserve for NPA | 44,236,148.00 | 37,236,148.00 | 4. | Loans and Advances | 548,738,656.20 | 478,916,681.20 |
| 5. | Overdue Interest Reserve | 38,406,958.46 | 33,300,995.46 | 5 | Interest Pending Receivables | 50,032,749.00 | 44,252,859.00 |
| 6. | Other Provisions | 1,301,362.43 | 1,074,542.43 | 6. | Other Assets | 29,020,764.38 | 35,037,352.24 |
| 7. | Other Liabilities | 49,528,229.72 | 56,665,912.42 | 7. | Furniture and Fixture: | 20,355,594.09 | 9,226,600.72 |
| | Propfit - 2024-25 | 7,262,320.77 | 10,040,166.95 | | | | |
| | Grand Total | 1,180,832,186.36 | 1,116,323,548.79 | | Grand Total | 1,180,832,186.36 | 1,116,323,548.79 |

Sd/- ACCOUNTANT | Sd/- CHIEF EXECUTIVE OFFICER | Sd/- CHARTERED ACCOUNTANT

PROFIT & LOSS ACCOUNT FOR THE YEAR ENDING 31-03-2025

| Sl. No. | EXPENDITURE | Balance at the end of the 31/03/2025 | Balance at the end of the 31/03/2024 | Sl. No. | INCOME | Balance at the end of the 31/03/2025 | Balance at the end of the 31/03/2024 |
|---|---|---|---|---|---|---|---|
| 1. | Interest paid on Deposits | 58,604,446.00 | 54,303,957.00 | 1. | Interest realised on Loan and advance and Investments | 106,891,267.33 | 95,182,973.00 |
| 2. | Establishment Charges | 8,826,586.00 | 7,510,198.00 | 2. | Contingent Charges | 296,938.82 | 282,636.72 |
| 3. | Contingent Charges paid | 5,767,126.50 | 5,269,996.00 | 3. | Sale amount & Other Charges | 20,226.00 | 11,304.00 |
| 4. | Other Expenditure | 27,035,923.23 | 18,709,273.89 | 4. | Other Charges Collected | 287,970.35 | 356,678.12 |
| | Total | 100,234,081.73 | 85,793,424.89 | | | | |
| | Net Profit | 7,262,320.77 | 10,040,166.95 | | | | |
| | Grand Total | 107,496,402.50 | 95,833,591.84 | | Grand Total | 107,496,402.50 | 95,833,591.84 |

Sd/- ACCOUNTANT Sd/- CHIEF EXECUTIVE OFFICER Sd/- CHARTERED ACCOUNTANT

## పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి


మల్లయ్య మృతదేహం

సిరిసిల్ల క్రైం, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామానికి చెందిన మొగిలి మల్లయ్య(55)అనే పశువుల కాపరి రగుడు గ్రామంలో గొర్లను మేపు తుండగా సోమవారం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వర్ధవెల్లి గ్రామానికి మల్లయ్య గొర్లను మేపేందుకు రగుడు ప్రాంతానికి రోజుల క్రితం వచ్చాడు. రగుడులో బంధువుల ఇంట్లో ఉంటూ గొర్లు మేపుకుంటుండగా ప్రమాదవశాత్తు పిడుగు పడి మృతి చెందాడు. స్వగ్రామం వర్ధవెల్లిలో విషాదం అలుముకుంది. మల్లయ్యకు భార్య ఎల్లవ్వ, కుమారులు ఉన్నారు.

## పిడుగుపాటుతో విద్యుత్ పరికరాలు ధ్వంసం

సుల్తానాబాద్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న కల్వల గ్రామానికి చెందిన బండి రామచంద్రం స్వరూప దంపతులు ఇంటి సమీపంలో సోమవారం తెల్లవారుజామున చెట్టుపై పిడుగు పడింది. పిడుగుపాటుతో ఇంటిలోని స్విచ్ బోర్డులో మంటలు అంటుకున్నాయి. మంటల ద్వారా చెలరేగిన నిప్పు రవ్వలు కిందపడి వారు నిద్రిస్తున్న మంచంలోని పరుపు, దుస్తులు కాలిపోయాయి. వెంటనే మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో ఇంటిలోని విద్యుత్ వైరింగ్ కాలిపోయింది. ఫ్రిడ్జ్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైపోయినట్లు బాధితులు పేర్కొన్నారు.

## కిరాణా దుకాణం యజమానిపై దాడి

చందుర్తి, సెప్టెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): కిరాణా దుకాణం సామగ్రి ఉద్దెర ఇవ్వలేదని ఓ యువకుడు యజమానిని అసభ్యంగా దూషిస్తూ, దాడికి పాల్పడిన సంఘటన చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. చందుర్తి ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన బుర్ల మల్లేశం అనే కిరాణం దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ నెల 21న రాత్రి అదే గ్రామానికి చెందిన జీడి గణేష్ అనే యువకుడు కిరాణం సామాను ఉద్దెర ఇవ్వమని అడగగా మల్లేశం నిరాకరించాడు. దీంతో గణేష్ మల్లేశంను దూషిస్తూ దాడికి పాల్పడ్డాడు. మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గణేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్‌లో జక్కుల సంపత్ తన మొబైల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా కరీంనగర్ రూరల్ పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ నిజామాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం యజమానికి కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి అందజేశారు. ఫోన్‌ను స్వాధీనం చేసుకోవడంలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

## హోటల్‌లోకి దూసుకెళ్లిన లారీ

- ఓ మహిళకు గాయాలు


తాడికల్‌లో హోటల్‌లోకి దూసుకెళ్లిన లారీ

శంకరపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ వద్ద కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున ఓ లారీ ఆగి ఉన్న మరో లారీని ఢీకొట్టి హోటల్‌లోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపు కర్రలోడుతో వెళ్తున్న లారీ తాడికల్ వద్దకు రాగానే అదుపు తప్పి రోడ్డు పక్కకు నిలిపి ఉన్న లారీని ఢీకొట్టి హోటల్‌లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రోడ్డు పక్కన ఉన్న ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా హోటల్‌లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. లారీ ముందు భాగం ధ్వంసమైంది. డ్రైవర్, క్లీనర్‌లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

## ఒకరి ఆత్మహత్యాయత్నం

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాడూరి శ్రీనివాస్ అనే వ్యక్తి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉన్నది.




# ఉపాధిహామీ పథకంలో నకిలీలకు చెక్

- కూలీలకు ఈ-కేవైసీ తప్పనిసరి
- ప్రతి కూలీ వద్దకు ఫీల్డ్ అసిస్టెంట్‌లు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నకిలీలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కూలీలు తమ ఆధార్ కార్డులను జాబ్ కార్డులతో లింక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ-కేవైసీ లేకుంటే కూలీ డబ్బులు అందే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లోని


ఈ - కేవైసీ నమోదును పరిశీలిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని

ఫీల్డ్ అసిస్టెంట్‌లు జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరి ఇంటికి వెళ్లడంతో పాటు పనుల వద్దకు వెళ్లి ఈ-కేవైసీ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

### హాజరు పకడ్బందీగా అమలు

ఉపాధిహామీ పథకంలో పనులకు వస్తున్న కూలీల హాజరును నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఉపాధి పథకంలో భాగంగా గతంలో కూలీలు పనులకు రాకున్నా హాజరు వేయడంతో అవి అధికారుల దృష్టికి రాగా నివేదికను పంపించారు. దీనిని చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ - కేవైసీ తప్పనిసరి చేసింది. పనికి వచ్చిన కూలీ ఫొటో తీసి అప్‌లోడ్ చేశాక నాలుగు గంటల తరువాత మరోసారి ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తారు. ఒకే వ్యక్తి రెండు ఫొటోల్లో ఉంటేనే కూలీ డబ్బులు ఖాతాలో జమ అవుతాయి. ఈ విధానంపై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇది పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తే నకిలీ హాజరుకు అవకాశం ఉండదని, వేతనాల చెల్లింపుల్లోనూ జాప్యం లేకుండా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

ఈ కేవైసీ ప్రక్రియను అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్‌లు గ్రామాల వారీగా ఈ-కేవైసీ చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు జాబ్ కార్డుల వారి ఇంటికి వెళ్లి యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్నారు.

### సిగ్నల్ లేక సతమతం

ఉపాధిహామీ కార్డు దారులకు కేంద్ర ప్రభుత్వం ఈ-కేవైసీ తప్పనిసరి చేయడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనిలో పడ్డారు. అయితే గ్రామాల్లో సిగ్నల్ సరిగా లేకపోవడంతో నమోదు ఆలస్యం అవుతుందని పేర్కొంటున్నారు. దీంతో పాటు ఫొటో తీసుకునే సమయంలో లైటింగ్ లేకున్నా యాప్ తీసుకోని పరిస్థితి ఉందని, అలాంటి వారికి ఈ - కేవైసీ నమోదు ఆలస్యం అవుతుందని పలువురు పేర్కొంటున్నారు.

### మండలంలో 16,771 వేల జాబ్ కార్డులు

పెద్దపల్లి మండలంలోని 30 గ్రామాల్లో 16 వేల 771 జాబ్ కార్డులు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ లు లేకపోగా 30 గ్రామాలకు 21 మంది మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు. మిగతా గ్రామాల్లో సీనియర్ మేట్‌లు ఈ కేవైసీ చేస్తున్నారు. నమోదు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

### ఈ కేవైసీని తప్పనిసరి



**రమేష్‌బాబు, ఏపీవో, పెద్దపల్లి**

ఉపాధిహామీ పథకానికి వచ్చే కూలీలు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. ప్రతి కూలీ వద్దకు ఫీల్డ్ అసిస్టెంట్ వెళ్లి ఈ కేవైసీ చేస్తారు. ఈ కేవైసీపై కూలీలు త్వరగా చేయించుకొని అధికారులకు సహకరించాలి

### త్వరితగతిన పూర్తి చేస్తాం

**కొప్పుల శ్రీనివాస్, ఎంపీడీవో, పెద్దపల్లి**



గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ కూలీల ఈ కేవైసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తాం. గ్రామాల్లో చేపడు తున్న నమోదు ప్రక్రియను ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నాం. వీలైనంత వరకు త్వరగా పూర్తి చేస్తాం. కూలీకి వచ్చే ప్రతి ఒక్కరూ ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలి.

## బావిలో పడి ఒకరి మృతి

సైదాపూర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన గుంటి యాదగిరి(45) అనే వ్యక్తి గ్రామ సమీపంలోని డంపింగ్‌యార్డ్ పక్కన గల గ్రామ పంచాయతీ పాడుపడిన బావిలో పడి మృతి చెందాడు. పోలీసలు, స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరికి మతిస్థిమితం సరిగా ఉండడం లేదు, ఈ నెల 19న ఇంటినుంచి బయటకు వెళ్లి పోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ కనిపించలేదు. సోమవారం గ్రామ పంచాయతీ పాడుపడిన బావిలో మృతదేహం గుర్తించారు. కుటుంబ సభ్యులు ఆ మృతదేహం యాదగిరిదేనని గుర్తించారు. తన కొడుకు మతి స్థిమితం సరిగా లేక, కళ్లు కనిపించకపోవడంతో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడని మృతుడి తల్లి గుంటి లక్ష్మి పోలీసులకు పిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

## కిరాణం దుకాణంలో చోరీ

ఇల్లంతకుంట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కిరాణం దుకాణంలో చోరీ జరిగింది. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి సాదుల ఆగయ్య తన ఇంటివద్ద కిరాణం దుకాణం నడిపిస్తున్నాడు. దుకాణానికి ఆదివారం రాత్రి తాళం వేసి ఇంట్లోకి వెళ్లాడు. అర్ధరాత్రి మెలకవ వచ్చి బయటకు వచ్చి చూడగా దుకాణానికి ఉన్న తాళం పగలగొట్టి రూ 6వేల నగదు, దుకాణంలోని సామగ్రి అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని విచారణ జరుపుతున్నారు. కొద్దిరోజుల క్రితమే ఆగయ్యకు చెందిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకొని పోయారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మావోయిస్టు అగ్రనేతల మృతి


కోస మృతదేహం


కాతా రామచంద్రారెడ్డి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్‌లో సోమవారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన సీపీఐ (ఎంఎల్) మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యులు కడారి సత్యనారాయణరెడ్డి అలియస్ కోసా దాదా అలియస్ సాధు, అలియాస్ వినోద్ అలియాస్ బుచ్చన్న (70), కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజు దాదా మృతి చెందారు.

- కేశోరాంలో పని చేస్తూ అజ్ఞాతంలోకి..

రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లికి చెందిన కడారి సత్యనారాయణ రెడ్డి 1979లో సిరిసిల్లలో ఇంటర్‌మీడియట్, పెద్దపల్లిలో ఐటీఐ పూర్తిచేసి అనంతరం బసంత్ నగర్‌లో అప్రెంటీస్‌షిప్ చేశాడు. వివాహం చేసుకోలేదు. రిటైర్డ్ టీచర్ కడారి కృష్ణారెడ్డి పెద్ద కుమారుడు సత్యనారాయణరెడ్డికాగా ఆయనకు ఒక సోదరుడు కరుణాకర్‌రెడ్డి, ఇద్ద సోదరిలు ఉన్నారు. బసంత్‌నగర్‌లో అప్రెంటీస్‌షిప్ చేసే సమయంలో హైదరాబాద్‌లో కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ నిర్వహించిన థియరీ క్లాస్‌లకు హాజరువుతున్న సమయంలోనే సత్యనారాయణరెడ్డి మావోయిస్టు (అప్పటి సీపీఐ ఎంఎల్ పీడబ్ల్యుజి గ్రూపు) సభ్యులు, నాయకులతో పరిచయాలు ఏర్పడ్డాయి. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్శితుడై 1980లో అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి 2008 వరకు వివిధ హోదాల్లో పనిచేసిన సత్యనారాయణ రెడ్డి చాలా కాలంపాటు ఛత్తీస్‌గఢ్ డీకేఎస్‌జెడ్‌సీగా పనిచేశాడు. ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర అంతర్‌రాష్ట్ర సరిహద్దు అభూజ్‌మడ్ ప్రాంతంలో జరిగిన పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన కడారి సత్యనారాయణ రెడ్డిపై రూ. 40 లక్షల రివార్డు ఉంది.

### ఉపాధ్యాయుడి నుంచి డెన్ కీపర్‌గా రామచంద్రారెడ్డి

సీపీఐ(మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడైన కాతా రామచంద్రారెడ్డి (66) అలియాస్ కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజు దాదా అలియాస్ విజయ్ అలియాస్ వికల్ప్ స్వస్థలం ఉమ్మడి జిల్లా కోహెడ మండలం తీగలకుంటపల్లి(ప్రస్తుత సిద్దిపేట జిల్లా). ఆయన పదో తరగతి వరకు కోహెడలో చదివారు. అనంతరం సిద్దిపేటలో బీఎస్సీ (ఎంపీసీ), వరంగల్‌లో బీఎడ్ పూర్తి చేసిన తరువాత కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. అక్కడి నుంచి కోహెడ మండలం వరకోలుకు బదిలీ అయ్యారు. అనంతరం ఉన్నత చదువుల (ఎల్ఎల్‌బీ) కోసం మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్లారు. ఆ సమయంలో మావోయిస్టు పార్టీతో అనుబంధం ఏర్పడి, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్శితుడై ఆ పార్టీ లీగల్ ఆర్గనైజేషన్‌లో కొద్ది రోజులు పనిచేశాడు. ఆ తరువాత దళాలతో కలిసి అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోయాడు. ఛత్తీస్‌గఢ్‌లో రాంచంద్రారెడ్డి, ఆయన భార్య శాంతిప్రియ అలియాస్ మాలతి డెన్‌కీపర్‌గా పనిచేశారు. రాంచంద్రారెడ్డి భార్య సిద్దిపేటకు చెందిన వారు. ఆమె 2008లో ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో అరెస్టు అయ్యారు.

### గోపాల్‌రావుపల్లిలో కలకలం

సిరిసిల్ల క్రైం, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ మెంబర్ కడారి సత్యనారాయణ రెడ్డి అలియాస్ కోస, గోపన్న, సాధు ఎన్‌కౌంటర్ స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లిలో కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన కడారి అన్నమ్మ, కృష్ణారెడ్డి దంపతుల చిన్న కుమారుడు అయిన సత్యనారాయణరెడ్డి 1955లో జన్మించాడు. పెద్దపల్లిలో ఐటీఐ చదువుతుండగా రాడికల్ విద్యార్థి ఉద్యమం వైపు ఆకర్షితుడయ్యాడు. 45 ఏళ్లుగా పీపుల్స్ వార్, మావోయిస్టు పార్టీలో పని చేస్తూ గెరిల్లా యుద్ధ నిపుణుడిగా పేరు తెచ్చుకున్నాడు. కోస దండ కరణ్య స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా, మిలటరీ కమాండర్‌గా, సెంట్రల్ కమిటీ సభ్యునిగా పని చేశారు. దేశంలోని ఐదుగురు ప్రధాన నక్సల్స్ నేతల్లో ఒకరు.

- 1980లో గ్రామం విడిచి

స్వగ్రామం అయిన గోపాల్‌రావుపల్లికి మార్చి 1980లో ఉగాది పండుగ రోజు చివరి సారిగా వచ్చి కుటుంబ సభ్యులను కలిసి వెళ్లాడు. అప్పటి నుంచి ఊరు వైపు చూడలేదు. ఇంటికి వచ్చినపుడే సర్టిఫికెట్స్ ఫొటోలు అన్నీ తీసుకెళ్లాడు. 2012లో తల్లి అన్నమ్మ, 2013లో తండ్రి కృష్ణారెడ్డి మరణించారు. అక్క జయశ్రీ కూడా మరణించింది. తల్లిదండ్రులు మరణించిన కడసారి చూపులకు రాలేదు. ఆయన సోదరుడు కరుణాకర్‌రెడ్డి కరీంనగర్‌లో నివసిస్తున్నాడు.

ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగిన గోపాల్‌రావుపల్లి ఉలికిపడేది. చివరికి సత్యనారాయణరెడ్డి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్నప్పటి స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధవులు కోస ఎన్‌కౌంటర్‌పై చర్చించుకుంటున్నారు.

## నాటుసారా , బెల్లం పానకం పట్టివేత

గంభీరావుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజసింగవరం గ్రామంలో 2 లీటర్ల నాటుసారా , 20 లీటర్ల బెల్లం పానకాన్ని స్థానిక పోలీస్‌లు సోమవారం పట్టుకున్నారు. సమాచారం మేరకు లక్ష్మయ్య, సరోజనల పూరి గుడిసెలో పోలీస్‌లు సోదాలు చేశారు. గుడిసెలో 2 లీటర్ల నాటుసారా, 20 లీటర్ల బెల్లం పానకం లభ్యమైంది. బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.దాడుల్లో సిబ్బంది బాల శ్రీనివాస్, అనిల్, సాయి రామకృష్ణ, వెంకటేష్, వేణు ఉన్నారు.

# బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో చోరీ

రుద్రంగి,సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో దొంగలు చొరబడి హుండీ, సామగ్రిని దొంగిలించారు. ఆలయం అటవీ ప్రాంతంలో ఉండడంతో ఆలయానికి వేసిన తాళం పగులకొట్టి దొంగలు ఆదివారం చోరీకి పాల్పడ్డారు. హుండీని పగులకొట్టి నగదు, ఇతర సామగ్రి దొంగిలించారు. ఆలయ పూజారి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

- కథలాపూర్ : మండలంలోని కలికోట శివారులో ఉన్న త్రికోటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. హుండీ పగులగొట్టి అందులో ఉన్న ఆరు తులాల వెండి, నగదును ఎత్తుకెళ్లారని గ్రామస్థులు తెలిపారు. పగులగొట్టిన హుండీని ఆలయ శివారులో ఉన్న పొలాల వద్ద పడేసి వెళ్లారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై నవీన్ పరిశీలించారు. ఆలయంలో సీసీ కెమెరాలు బిగించుకోవాలని ఎస్సై సూచించారు.


రుద్రంగిలో చోరీ జరిగిన ఆలయంలో పరిశీలిస్తున్న పోలీసులు

## ఆటో బోల్తా : 10 మందికి గాయాలు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట శివారులో ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో సోమవారం 10 మందికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామం నుంచి 10 మంది ప్యాసింజర్ ఆటోలో జగిత్యాల వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే హన్మాజీపేట మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో నక్క గంగవ్వ, తోట గంగవ్వ, మెడపట్ల లక్ష్మీ, ఆటోడ్రైవర్ సాయితో పాటుగా ద్విచక్రవాహనదారుడు పెద్దులు తీవ్రంగా గాయపడగా మరో ఆరుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## ట్రాలీ ఆటోలో పాము.. అదుపు తప్పిన వాహనం

మల్యాల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మల్యాల మండల పరిషత్ కార్యాలయం సమీపంలో సోమవారం ఓ ట్రాలీ ఆటో వేగంగా వస్తూ పొదల్లోకి దూసుకెళ్లడంతో ఎదురుగా వస్తున్న కొందరు హైరానా పడ్డారు. ఇందుకు కారణం ఆటో డ్రైవర్ క్యాబిన్‌లో పాము చొరబడడమే. మల్యాల బీసీ కాలనీకి చెందిన సిద్దిఖ్ పండ్ల విక్రయాలు చేస్తుంటాడు. రోజు మాదిరిగానే సోమవారం ఇంటి ఆవరణలో నిలిపిన ఆటో తీసుకొని కొండగట్టు వెలుతుండగా కాసేపటికి అప్పటికే అందులో దూరిన పాము కాళ్లపైకి రావడంతో కంగారుపడ్డాడు. దీంతో వాహనం రహదారిపై అటు, ఇటు వస్తుండగా ఎదురుడా ఓ మహిళ, మరి కొందరిని గమనించిన ఆయన క్రీడామైదానం ఫెన్సింగ్ పొదల్లోకి తీసుకెళ్లి అందులో నుంచి బయటకు దూకేశాడు. ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో ఊరిపిపీల్చుకున్నాడు.

## నవంబరులో ఎస్‌యూ రెండో స్నాతకోత్సవం

- గవర్నర్ అనుమతి కోరిన వీసీ


గవర్నర్, జిష్ణు దేవ్‌వర్మకు పుష్ప గుచ్ఛం అందిస్తున్న వీసీ

గణేశ్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం రెండో స్నాతకోత్సవం నవంబరు 7న నిర్వహించడానికి గవర్నర్, యూనివర్సిటీ కులపతి జిష్ణు దేవ్‌వర్మ అనుమతిచ్చారని వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ తెలిపారు. స్నాతకోత్సవం సందర్భంగా కీలక ఉపన్యాసం చేయడానికి కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ఉపకులపతి ఆచార్య బి.జె.రావు హాజరుకానున్నట్లు తెలిపారు. స్నాతకోత్సవంలో పీజీ విద్యా ర్థులకు బంగారు పతకాలు, పీహెచ్‌డీ పరిశోధకులకు డాక్టరేట్ పట్టాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు

## విద్యుదాఘాతంతో జీపీ కార్మికుడికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై గ్రామపంచాయతీ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. శంకరపట్నం మండలం వంకాయ గూడెం గ్రామపంచాయతీలో పనిచేస్తున్న చలిగంటి సురేష్ సోమవారం విద్యుత్ స్తంభం ఎక్కి బల్బు అమరుస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

### విద్యుదాఘాతంతో గొర్రె మృతి

తిమ్మాపూర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నుస్తులాపూర్‌లో ఆవుల ఐలయ్య అనే గొర్రెల కాపరి సోమవారం తన గొర్రెల మందను మేతకు తీసుకెళ్లాడు. గ్రామ శివారులో విద్యుత్ స్తంభం పక్కన మేస్తున్న గొర్రె విద్యుదాఘాతంతో మృతి చెందింది. గొర్రెను కాపాడేందుకు వెళ్లిన కాపరికి షాక్ తగలడంతో తప్పించుకున్నాడు.

## ప్లాస్టిక్ ఫ్యాక్టరీ అగ్ని ప్రమాదంలో రూ. 10లక్షల ఆస్తి నష్టం

- పోలీసుల అదుపులో ఫ్యాక్టరీ వర్కర్లు


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని పద్మనగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదానికి కారణం ఆ ఫ్యాక్టరీలో పనిచేసే వర్కర్ అని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. పద్మనగర్‌లోని ఇండస్ట్రియల్ ఏరియాలో హుమేరా ఇండస్ట్రీస్ కరీంనగర్ పేరుతో ఒక ఫ్యాక్టరీ నడుస్తోంది. ప్లాస్టిక్ కవర్లు, ఇతర పాత ప్లాస్టిక్‌ను కరిగించి ప్లాస్టిక్ సామగ్రి తయారు చేసే ఫ్యాక్టరీలకు సరఫరా చేస్తుంటారు. దీని యజమాని లతీఫ్ కాగా రెండు రోజుల నుంచి ఒక కార్మికుడు యజమానితో గొడవపడుతున్నట్లు తెలిసింది. ఈ గొడవను దృష్టిలో పెట్టుకొని యజమానికి నష్టం కలిగించాలనే ఉద్దేశంతో ఆదివారం రాత్రి 11 గంటల వరకు ఇద్దరు ముగ్గురు వర్కర్లు మద్యం తాగారు. అక్కడి నుంచే యజమానికి ఫోన్ చేశారు. యజమాని వచ్చి వర్కర్లను మందలించి వెళ్లిపోయాడు. ఆ తరువాత అర్ధరాత్రి సమయంలో ఇతర రాష్ట్రానికి చెందిన ఒక వర్కర్ ఫ్యాక్టరీలోకి చొరబడి మంట అంటించినట్లు తెలిసింది. ఫ్యాక్టరీలో మంటలు అంటుకున్న విషయం స్థానికుల ద్వారా, పోలీసులకు, అగ్నిమాపకశాఖ అధికారులకు తెలియగానే యజమాని అక్కడికి వెళ్లి పరిశీలించాడు. మొదట విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌గా భావించారు. ఒక వర్కర్‌పై అనుమానం ఉందని యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడ పనిచేస్తున్న ఆరుగురు వర్కర్లను సోమవారం అదుపులోకి తీసుకుని విచారించగా ఈ అగ్నిప్రమాదానికి అసలు కారణం వెల్లడైంది. ప్రమాదంలో ఒక ద్విచక్రవాహనంతో పాటు 10 లక్షల రూపాయల విలువైన ప్లాస్టిక్ రా మెటీరియల్ దగ్ధమైందని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. రాత్రి 12 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం ఘటన సమాచారం అందుకున్న కరీంనగర్ రెండో టౌన్ సీఐ సృజన్‌రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు పరిసర ఫ్యాక్టరీలు, నివాసాల వైపు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని 3 ఫైరింజన్‌లతో 4 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనపై రెండో టౌన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రూ.6,220 పలికిన పత్తి ధర

జమ్మికుంట, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,220 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 29మంది రైతులు 106క్వింటాళ్ల విడి కొత్త పత్తి, పది మంది రైతులు 15క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,220, కనిష్ఠ ధర రూ.4వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

## సర్వీస్ రోడ్డు మంజూరు చేయాలని దీక్ష


ఈదులగట్టెపల్లిలో దీక్ష చేపట్టిన గ్రామస్థులు

మానకొండూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సర్వీస్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఈదులగట్టెపల్లి గ్రామస్థులు జాతీయ రహదారి పనులను అడ్డుకొని నిరాహార దీక్ష చేపట్టారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ స్వాతి సంఘటనా స్థలానికి చేరుకొని దీక్ష విరమింపజేయాలని కోరారు. అధికారులు వచ్చే వరకు దీక్షను విరమించేది లేదని గ్రామస్థులు భీష్మించుకుకూర్చున్నారు. ఆర్డీవో మహేశ్వర్ ఫోన్‌లో మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి సంబంధించిన అధికారులతో చర్చించి సర్వీస్ రోడ్డు నిర్మాణం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు బెడద ప్రభాకర్, మీస సత్యనారాయణ, మీస రమేశ్, అప్పని తిరుపతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన దేవీనవరాత్రోత్సవాలు


ధర్మపురిలో శైలపుత్రి రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీదేవి నవరాత్రోత్సవాలను సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం పుణ్యావచనంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి రోజున దుర్గాదేవి అమ్మవారు భక్తులకు శైలపుత్రి అలకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి అభిషేకం, సతీసమేత పూజ, పరివార దేవతలకు అభిషేకాలు, గాయత్రి హవనం నిర్వహించారు.

### ధర్మపురిలో శైలపుత్రి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

**ధర్మపురి:** ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ శ్రీ రామ లింగేశ్వర స్వామి దేవాలయాల్లో దేవీ నవరాత్రోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మొదటి రోజు అమ్మవారలు శైలపుత్రి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. సాయంత్రం లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల సేవలను ఊరేగించారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేసి అమ్మవారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జుక్కు రవీందర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన నవరాత్రోత్సవాల్లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తన కొడుకు హరీష్‌తో కలిసి అమ్మవారలను దర్శనంచేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

### కొండగట్టులో..

**మల్యాల:** కొండగట్టు అంజన్న సన్నిధిలో దుర్గాదేవి శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్, రఘు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.


కొండగట్టులో బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు


వేములవాడలో..

## జైలులో మౌలిక వసతుల పరిశీలన


జైలును సందర్శించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేశ్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా జైలులో ఖైదీలకు భోజనంతో పాటు ఇతర మౌలిక వసతులను సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.వెంకటేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి భోజన వసతి, యోగక్షేమాలు, న్యాయ సేవలు, ఆరోగ్య సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ విజయ్‌డేని, జైలర్లు శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ జైలర్లు సుధాకర్‌రెడ్డి, రమేష్, అజయ్‌చారి పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ నుంచి రెండు లక్షల క్యూసెక్కుల నీటి విడుదల

జగిత్యాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు సోమవారం ఇన్‌ఫ్లో పెరిగింది. 40 గేట్లు పైకి ఎత్తి 2లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 6,735 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,500, సరస్వతీ కాలువకు 400 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

### పార్వతి బ్యారేజీ నుంచి..

మంథనిరూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం సమీపంలోని పార్వతి (సుందిళ్ల) బ్యారేజీలో సోమవారం గోదావరి నదిలో వరద ఉధృతి పెరిగింది. ఎగువ ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తి వేయడంతో పై నుంచి భారీ వరద నీరు దిగువన ఉన్న పార్వతి బ్యారేజీలోకి వచ్చి చేరుతుంది. అయితే బ్యారేజీలో 74 గేట్లు ఎత్తి ఉండటంతో 3 లక్షల 99 వేల క్యూసెకుల నీరు దిగువకు విడుదల అవుతుంది. వరద నీటి ప్రవాహం పెరిగితే మళ్లీ పంట పొలాలు మునిగి పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### మిడ్ మానేరు నుంచి..

బోయినపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి (మిడ్ మానేరు) ప్రాజెక్టుకు సోమవారం 6500 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 4500 మానేరు, మూలవాగు ద్వారా2000 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దిగువకు ఒక గేట్ ద్వారా 2200 క్యూసెక్కులు ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కులు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200 నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.88 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.248 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

### అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ లోకి ఒక పంపు ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5టీంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.27 టీఎంసీల నీరుఉంది. మధ్యమానేరు ద్వారా వస్తున్న 3200క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

### ఎల్‌ఎండీ గేట్ల మూసివేత

తిమ్మాపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశయంలోకి ఎగువ నుంచి వస్తున్న నీటి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఇరిగేషన్ అధికారులు గేట్లు మూసివేశారు. ఎల్‌ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.51 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 2,609క్యూసెక్కులు, మిడ్ మానేరు నుంచి 2,200క్యూసెక్కులు మొత్తం 4,809 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండిలోకి వస్తోంది. కాకతీయ కాలువ నుంచి 4500 క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 309క్యూసెక్కులు మొత్తం 4,809 క్యూసెక్కుల నీరు ఆవుట్ ఫ్లో ఉంది.

### పింఛన్ పెంచాలని వికలాంగుల ధర్నా

వీణవంక, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ ఎదుట సోమవారం పింఛన్ పెంచాలని వికలాంగులు ధర్నా చేపట్టారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ గ్రహిత మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ప్రతి గ్రామంలో ధర్నా చేపట్టినట్టు తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రమేష్, మధునయ్య, సాయితేజ, షాహిద్, సదానందం తదితరులున్నారు.

## ఊసేలేని ఉల్లాస్


మార్గదర్శి వాచకం

- మహిళా సంఘాల నిరక్షరాస్యులకు మొదలు కాని పాఠాలు
- గ్రామాల్లో ముందుకురాని వలంటీర్లు
- మూలన పడిన పుస్తకాలు

కథలాపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో 15 ఏళ్ల నుంచి 65ఏళ్ల లోపు మహిళా నిరక్షరాస్యులకు విద్య నేర్పించాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఉల్లాస్ కార్యక్ర మానికి ఆదిలోనే హంసపాదు పడింది. ఎంతో ఆర్భాటంగా వయోజన విద్యా విభాగం నవభారత సాక్షరతా కార్యక్రమంలో భాగంగా ఈనెల 1 నుంచి అక్షర వికాసం పేరిట పాఠాల బోధనకు శ్రీకారం చుట్టింది. వంద రోజుల నిర్ణీత కాలాన్ని నిర్దేశించుకుని ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఈ క్రమంలో మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యులను వీవోఏలతో సర్వే చేయించి వారిని గుర్తించారు. తదనంతరం వీవోఏలకు పాఠాలు బోధించే విధానాన్ని స్థానిక ఉపాధ్యాయులతో శిక్షణ కూడా ఇప్పించారు. ప్రత్యేకంగా రూపొందించిన మార్గదర్శిని పుస్తకాలను పంపిణీ చేశారు. మహిళా కేంద్రితంగా సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక స్థితిని దృష్టిలో ఉంచుకుని నిత్య జీవిత అనుభవాన్ని చదువులో కలుపుకొని 'మనం చదవగలం' అనే భావనతో రూపకల్పన చేశారు.

### కేంద్రాల నిర్వహణకు వలంటీర్ల విముఖత

జిల్లాలో 15,121 మహిళా సంఘాలు ఉండగా 1,75,532 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 33,427 మంది నిరక్షరాస్యులు ఉండడంతో పది మందికి ఒకరిని చొప్పున 2,256 మంది వలంటీర్లను నియమించారు. 5 నుంచి 10వ తరగతి చదివిన వారు 1,698 మంది, ఇంటర్ మధ్యలో డ్రాపవుట్ అయిన వారు 626 మంది ఉన్నట్టు సర్వేలో తేలింది. కథలాపూర్ మండలంలో 2,656 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించి 165 మందిని వారికి చదువు చెప్పడానికి వలంటీర్లను నియమించారు. నిరక్షరాస్యులకు అక్షర జ్ఞానం, సంఖ్యా పరిజ్ఞానం నేర్పించాలని వలంటీర్లకు సూచించారు.

అక్షరాలతో బొమ్మలపేర్లు, పదాలు, వాక్యాలు, రాయడం వంటివి వంద రోజుల ప్రణాళికతో బోధన చేయాలి. సంపూర్ణ అక్షరాస్యులుగా మారిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేయాలని నిర్ణయించారు. "ఆదాయం పెంచుకోవడం, ఇరుగు, పొరుగు మాటా మంతి, ఒకరికొకరు తోడైతే అదే సంఘం, ఇంటింటీ చెట్టు.. ఊరంతా పచ్చదనం, పోషకాహారం, అనారోగ్యాలకు కారణాలు, చట్టాన్ని తెలుసుకుందాం, స్వచ్ఛ భారత్, ఫోన్ లేకుంటే ఈ రోజుల్లో ఇబ్బందే, ఎన్నికల్లో ఓటా? నోటా?, నైపుణ్యాలను పెంచుకో...అభివృద్ధి పెంచుకో, దేశాన్ని ప్రేమిద్దాం... జాతి ఘనతను చాటుదాం" అనే పాఠ్యాంశాలను చేర్చారు. అట్టముక్కలు, కాగితాలు వంటి బోధనోపకర ణాలను ఉపయోగించి వృద్ధులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. అయితే వలంటీర్లుగా ఉన్న వీవోఏలకు ఎలాంటి గౌరవ వేతనం ఇవ్వక పోతుండడం వల్ల కేంద్రాల నిర్వహణ ఎక్కడా కనిపించడం లేదు. కేవలం శిక్షణ వరకే మిగిలిపోగా ఉల్లాస్ ఊసే లేకుండా పోయింది.

### కేంద్రాలు కొనసాగించేలా వీవోఏలను ఆదేశిస్తాం

**చిన్నరాజయ్య, సెర్ప్ ఏపీఎం**



మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది వివిధ రంగాల్లో స్థిరపడేలా చేయడానికి ఉల్లాస్ కార్యక్రమం ప్రారంభించాం. ఆయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయుల పర్య వేక్షణలో ఈ కేంద్రాలను నడపాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 1 నుంచి ప్రారంభించడానికి మార్గదర్శి వాచకాలను కూడా సరఫరా చేశాం. వలంటీర్లతో బోధన చేయాలని నిర్ణయించారు. కేంద్రా లు కొనసాగించి మహిళలను అక్షరాస్యులుగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తాం.




## చక్కెర ఫ్యాక్టరీని త్వరలో పునఃప్రారంభిస్తాం

**మాజీ మంత్రి జీవన్‌రెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీని త్వరలోనే పునఃప్రారంభిస్తామని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం మెట్‌పల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఫ్యాక్టరీని తెరిపిస్తామన్నారు. బకాయి ఉన్న రూ.170 కోట్లను ప్రభుత్వం చెల్లించిందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. చక్కెర ఫ్యాక్టరీ పరిశీలనకు ఈనెల 26న రాష్ట్ర వ్యవసాయ శాఖ సెక్రెటరీ, ఉన్నతాధికారులు వస్తున్నారని తెలిపారు. రైతుల అభిప్రాయలు తెలుసుకునేందుకే పరిశ్రమల కార్యదర్శితో పాటు వ్యవసాయ శాఖ కమిషనర్ వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేంధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, రాంప్రసాద్, ముఖీం, షస్త్రక్ మహమ్మద్, సంతోష్‌రెడ్డి, జాకీర్, మహేందర్ పాల్గొన్నారు.

## 25 నుంచి ఉమ్మడి జిల్లా ఆదివాసీ శిక్షణ శిబిరాలు



మాట్లాడుతున్న టీపీసీసీ ఎస్టీసెల్ కో ఆర్డినేటర్ కోట్యా నాయక్

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లా స్థాయి ఆదివాసీ శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు టీపీసీసీ ఎస్టీ సెల్ కో ఆర్డినేటర్ కోట్యా నాయక్ తెలిపారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో విలేక రుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఆదివాసీ సెల్ కార్పొరేషన్ ఛైర్మన్ బెల్లా నాయక్ నేతృత్వంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో డీసీసీ కార్యాలయంలో మూడు రోజుల పాటు శిబిరం కొనసాగుతుం దన్నారు. మూడు రోజులపాటు సాగే శిక్షణ కార్యక్రమంలో ఆదివాసీల హ క్కులు, సమస్యలు, అభివృద్ధి, నాయకత్వ లక్షణాల పెంపుపై సంక్షేమ కార్యక్రమాలపై పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ముఖ్య నేతలకు నేటి నుంచి ఆహ్వాన పత్రికలు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రారంభ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, జిల్లా స్థాయి ముఖ్య నేతలు, ముగింపు శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ హాజరవుతారని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రావణ్ నాయక్, నగర కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కుర్ర పోచయ్య, నాయకులు లావుడియా రంగా నాయక్, సుధాకర్ నాయాక్, మోతిలాల్ నాయక్, వినోద్ నాయాక్, బాలు నాయక్, సాయి నాయక్ పాల్గొన్నారు

## మైనారిటీ కుటుంబాల ఆర్థిక భరోసాకు దరఖాస్తులు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): మైనారిటీ కుటుంబాలకు ఆర్థిక భరోసా కింద దరఖాస్తులను అక్టోబరు 6 వరకు స్వీకరించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రంగారెడ్డి సోమవారం తెలిపారు. పేద మైనారిటీ కుటుంబాల కోసం ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన, రేవంతన్న కా సహారా అనే పథకాలను ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. ఇందులో ముస్లిం, సిక్, బుద్దిస్టు, జైన్స్, పార్సీలకు రూ.50 వేలు, రేవంతన్న కా సహారా యోజన పథకం కింద ఫకీర్, దూదెకులు, పేద ముస్లింల అభివృద్ధికి మోపెడ్‌లు బైకులు, ఈ బైక్‌లకు లక్ష ఆర్థిక సహాయం అందించనున్నారని తెలిపారు. అర్హులైన వారు ఆధార్, రేషన్‌కార్డు, చిరునామాతో జత పరచాలన్నారు. అభ్యర్థుల వయస్సు 21-55 ఏళ్ల మధ్య ఉండాలని, ఒక సంవత్సరంలో ఒకరికి మాత్రమే ఆర్థిక సహాయం ఇస్తారని, ఐదేళ్ల నుంచి టీజీఎంఎఫ్‌సి నుంచి ఆర్థిక సహాయం తీసుకున్న వారు అనర్హులుగా పేర్కొన్నారు. అలాగే ఇందిరమ్మ మైనారిటీ మహిళా యువజన పథకం దరఖాస్తు చేసుకునే మహిళలు కనీసం 5వ తరగతి ఉత్తీర్ణత సాధించాలన్నారు.

## క్రిస్టియన్ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని క్రిస్టియన్ నిరుద్యోగ యువతకు ఉచితంగా ప్లంబర్స్ కోర్సు శిక్షణ కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రంగారెడ్డి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 27లోగా తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు.

రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఎస్‌సిసిఎల్, స్కూల్ బిల్డింగ్, ఎన్టీపీసీ గోదావరిఖని ద్వారా 90 రోజులపాటు యువతకు ప్లంబర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో క్రిస్టియన్, రోమన్ కాథలిక్, ఆంగ్లో ఇండియన్‌లు తహసీల్దార్ ద్వారా జారీ చేసిన బీసీ-సీ కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జత చేయాలన్నారు. అలాగే బాప్టిస్మ సర్టిఫికెట్‌తోపాటు సెల్ఫ్ డిక్లరే షన్ రూ.10 బాండ్ పేపర్ ఇవాలన్నారు. అభ్యర్థుల వయస్సు 18-45 లోపు ఉండాలని, గ్రామీణ ప్రాంతాల వారి తల్లిదండ్రుల ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షల లోపు ఉండాలని తెలిపారు. గతంలో శిక్షణ తీసుకున్న వారు అనర్హులని, 7వ తరగతి ఉత్తీర్ణతతోపాటు ఆధార్, ఓటరు ఐడీ కార్డు జత చేయాలన్నారు. వివరాలకు 9963313318, 9000294176 నెంబర్‌లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

## భక్తజనసంద్రంగా రాజన్న క్షేత్రం


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయం సోమవారం భక్తజన సందోహంగా మారింది. సోమవారం ఉదయాన్నే భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. కోడెమొక్కును చెల్లించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం ద్వారా శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### అమ్మవారిని దర్శించుకున్న విప్ ఆది శ్రీనివాస్..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం దర్శించుకున్నారు. శ్రీదేవి నవరాత్రోత్సవాలను పురస్కరించు కుని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తనయుడు ఆది కార్తీక్‌తో కలిసి అమ్మవారి పూజలో పాల్గొన్నారు. అర్చకులు వేదోక్త ఆశీర్వచనం ఇచ్చి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

శ్రీదేవినవరాత్రోత్సవాల్లో భాగంగా వేములవాడ పట్టణం, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దీక్ష చేపట్టారు. నాగిరెడ్డి మండపంలో సుమారు రెండు వందల మంది భక్తులు దుర్గామాత దీక్ష చేపట్టారు.

## హైలెవల్ వంతెన నిర్మాణం ఎప్పుడో?

- ఏటా వర్షాకాలంలో నిలిచిపోతున్న రాకపోకలు
- పట్టించుకోని పాలకులు
- అంబారిపేట-తుర్తి గ్రామస్థుల అవస్థలు

కథలాపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏటా వర్షాకాలంలో మండలంలోని మారుమూల గ్రామాలైన అంబారిపేట- తుర్తి గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించి పోతున్నాయి. ఎగువన ఉన్న అడవుల నుంచి వరద నీరు భారీగా వస్తుండడం వల్ల లోలెవల్ వంతెన పైనుంచి నీరు వెళ్తుంది. దీంతో భారీ వర్షాలు కురిస్తే రాకపోకలు రోజుల తరబడి నిలిచి పోవడం పరిపాటిగా మారుతోంది. తుర్తి గ్రామం కొడిమ్యాల, రుద్రంగి, బీమారం మండలాల సరిహద్దు అడవుల్లో ఉండడంతో కథలాపూర్ చేరుకునేందుకు ఒకే దారి ఉంది. వానాకాలంలో వంతెన పైనుంచి నీరు వస్తే బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండే పరిస్థితి నెలకొంటుంది. అంబారిపేట, కథలాపూర్, కోరుట్ల వంటి ప్రాంతాలకు చదువుకునేందుకు వెళ్లే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జీపులు, బస్సులే కాకుండా కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంటుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదతో బురద చేరుతున్నందు వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గతంలో అనేక సార్లు ప్రజాప్రతినిధులకు లోలెవల్ వంతెనను హైలెవల్ వంతెనగా మార్చాలని వినతి పత్రాలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు తమ ఇబ్బందులను పట్టించుకుని నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


అంబారిపేట -తుర్తి గ్రామాల మధ్య లోలెవల్ వంతెన




## కార్మికుల రుణం తీర్చుకుంటున్న కాంగ్రెస్

● ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్

గోదావరిఖని, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక, కర్షక, శ్రమజీవుల పక్షమని చెప్పడానికి, సింగరేణి కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన లాభాల వాటానే నిదర్శనమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. లాభాల వాటా ప్రకటనపై సీఎం, ఉపముఖ్యమంత్రి, ఐటీశాఖ మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. 33శాతం లాభాల వాటాకు ప్రభుత్వం యోచిస్తున్న సందర్భంలో శ్రీధర్‌బాబు నాయకత్వంలో కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలందరం ముఖ్యమంత్రిని కలిసి 1శాతం లాభాల వాటా పెంచేలా ప్రయత్నించామని రాజ్‌ఠాకూర్ చెప్పారు. సింగరేణి లాభాల్లో 34శాతం వాటా కార్మికులకు ప్రకటించడం మొదటి సారి అని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటాను కాంగ్రెస్ ప్రభుత్వమే ఇస్తోందన్నారు. గత సంవత్సరం కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల బోనస్ ఇస్తే ఇప్పుడు రూ.5500లకు చెల్లిస్తున్నదని ఆయన చెప్పారు. రాష్ట్రంలో కాంట్రాక్టు కార్మికులే లేరని గత ప్రభుత్వం కార్మికులపై చులకనభావంతో వ్యవహరించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను గౌరవిస్తున్నదని రాజ్‌ఠాకూర్ అన్నారు. కోల్ ఇండియా కూడా కార్మికులకు లాభాల వాటా చెల్లించడం లేదన్నారు. భవిష్యత్‌లో సింగరేణిలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పెంచడంతోపాటు సింగరేణి లాభాలు మరింత పెరిగేలా కార్యాచరణ జరుగుతుందన్నారు. లాభాల వాటా విషయంలో హర్షం వ్యక్తం చేస్తున్నట్టు మక్కాన్ తెలిపారు.

# సింగరేణి కార్మికులను కాంగ్రెస్ మోసం చేసింది

గోదావరిఖని, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కార్మికులను నమ్మించి మోసం చేశాయని టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణికి గతేడాది కన్నా ఎక్కువ లాభాలు వచ్చాయని, కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో సింగరేణి వాస్తవ లాభాల నుంచి కార్మికులకు వాటా చెల్లించామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో లాభాల వాటా విషయంలో వాస్తవ లాభాలను కాకుండా నికర లాభాల నుంచి వాటా చెల్లిస్తూ కార్మికులను వంచిస్తుందన్నారు. గడిచిన సంవత్సరం సింగరేణి సంస్థకు కార్మికులకు శ్రమ ఫలితంగా రూ.6394కోట్లు లాభాలు వస్తే రూ.4034కోట్లు భవిష్యత్ అవసరాల పేర పక్కన పెట్టి 34శాతం లాభాలు ప్రకటించామని పగల్బాలు పలుకుతున్నారని ఈశ్వర్ అన్నారు. 2023-24లో రూ.4701కోట్ల లాభం వస్తే విస్తరణ పేరిట రూ.2,289కోట్లు పక్కన పెట్టి కేవలం రూ.2,412కోట్లపై 33శాతం వాటా పేర రూ.796కోట్లు మాత్రమే కార్మికులకు పంచిందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం విస్తరణ కోసం పక్కకు పెట్టిన రూ.2289కోట్లు ఎక్కడ ఖర్చు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులను ముంచుతున్నదని ఆయన విమర్శించారు. సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తే కాంగ్రెస్, బీజేపీ వేలం పాటలకు సిద్ధమై సింగరేణిని ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. ఇప్పటికైనా నికర లాభాలపై కార్మికులకు వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా రేపటి నుంచి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపతామన్నారు. అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, జాహిద్‌పాషా, చెల్పూరి సతీష్, పొలాడి శ్రీనివాసరావు, పొగాకు రమేష్, బొడ్డు రమేష్, దూట శేషగిరి, కోంద్ర అంజయ్య, పుప్పాల రవీందర్, జనగామ మల్లేష్, గోపి, మీస రాజు, నూతి రాజ్‌కుమార్, మార్క వెంకటస్వామి, భాస్కర్, దేవేందర్ పాల్గొన్నారు.

### నిరాశ మిగిల్చిన లాభాల వాటా

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం వాస్తవ లాభాలను దాచి కార్మికులకు వాటాను ప్రకటించడంతో నిరాశకు గురిచేసిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రాజారెడ్డి ప్రకటనలో తెలిపారు. 2024-25లో వాస్తవ లాభాలు రూ.6,394 కోట్లు రాగా అందులో 4,034 కోట్లు పక్కనబెట్టి 2,360 కోట్లపై 34 శాతం వాటా ఇస్తున్నట్టు ప్రకటించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గెలిచిన సంఘాలు సంస్థ వాస్తవ లాభాల్లో నుండి కార్మికులకు వాటా ఇప్పించడంలో విఫలమైనట్టు తెలిపారు. సీఎం లాభాల వాటా ప్రకటించిన సందర్భంలో సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థల నుంచి బకాయిల రూపంలో రావాల్సిన 42 వేల కోట్లు, సొంత ఇంటి పథకం, మారు పేర్ల సమస్యలపై ప్రకటన చేస్తే బాగుండేదన్నారు. ఐక్య ఐక్య పోరాటాలకు కలసి రావాలని రాజారెడ్డి ప్రకటనలో కోరారు.

### లాభాల వాటా పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం కుట్ర

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల లాభాల వాటా పంపిణీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేసిందని, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ప్రభుత్వానికి తలొగ్గి కార్మికులకు నష్టం చేశాయని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఆరోపించారు. వాస్తవ లాభాలపై 34శాతం కార్మికులకు వాటా పంపిణీ చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# లాభాల వాటాపై ఏఐటీయూసీ అసంతృప్తి


సింగరేణి భవన్ ఎదుట ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు లాభాలు ప్రకటించే విషయంపై గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అసంతృప్తిని వ్యక్తం చేసింది. లాభాల వాటాపై సింగరేణి వ్యాప్తంగా చేసిన పోరాటాల ఒత్తిడితో ప్రకటనకు సిద్ధమైన ప్రభుత్వం, యాజమాన్యం 2023-24ఆర్థిక సంవత్సరం లాభాల నుంచి తీసిన నిధుల లెక్కలను స్పష్టం చేయకపోడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. లాభాల వాటా ప్రకటన అనంతరం హైదరాబాద్ సింగరేణిభవన్‌లో సీఎండీ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు అనంతరం నిరసన వ్యక్తం చేశారు. గత లాభాల నుంచి అభివృద్ధి కోసం పక్కకు పెట్టిన రూ.2289కోట్ల లెక్కలు చెప్పాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసి రెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంతో ఎలాంటి చర్చలు, సంప్రదింపులు జరుపకుండా, లాభాల విషయం చర్చించకుం డానే శాతాలను ప్రకటించి ఏక పక్షంగా వ్యవహరించడం సరైంది కాద న్నారు. కార్మిక సమస్యల విషయంలో దసరా తరువాత చర్చిద్దామని సీఎండీ చెప్పారని పేర్కొన్నారు. మిర్యాల రంగయ్య, సారయ్య, వీర భద్రయ్య, వైవీరావు, మడ్డి ఎల్లయ్య, ఎల్ ప్రకాష్, అక్బర్ అలీ, వెంకట్, బాజీ సైద, సత్యనారాయణ, మల్లేష్, తిరుపతి, రవీందర్, రాంగోపాల్ పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులకు దసరా జోష్..

(5వ పేజీ తరువాయి)

ఉత్పాదకతలను పెంచేందుకు ప్రోత్సాహకరంగా ప్రారంభమైన లాభాల వాటా ఇప్పుడు క్రమంగా సింగరేణి కార్మికుడి హక్కుగా మారుతోంది. 1999-2000 ఆర్థిక సంవత్సరంలో లాభాల వాటా పంపిణీ కార్మికులకు ప్రారంభమైంది. ఆ సంవత్సరం సింగరేణికి రూ.300కోట్ల లాభం వచ్చింది. ఇందులో 10శాతం కార్మికులకు బోనస్‌గా ప్రకటించారు. ఈ 10శాతం రూ.30కోట్లను అప్పుడు సింగరేణిలో పని చేస్తున్న 10700వేల మంది కార్మికులకు ఈ రూ.30 కోట్లను పంచారు. ఒకొక్కరికి రూ.2,782ల వాటా వచ్చిం ది. 2000-01లో ప్రతి ఉద్యోగికి లాభాల వాటా కేవలం రూ.850మాత్రమే వచ్చింది. అప్పట్లో కార్మికుడి సగటు జీతం రూ.8500మాత్రమే. ఇప్పుడు కార్మికుడి సగటు జీతం రూ.1.7లక్షలు. గడిచిన పదేళ్లుగా సింగరేణి వేల కోట్ల రూపాయల లాభాలను ఆర్జిస్తున్నది. 10శాతంగా ప్రారంభమైన లాభాల వాటా ఇప్పుడు 34శాతానికి పెరి గింది. దీంతో కార్మికులకు లాభాల వాటా గత సంవ త్సరం, ఈ సంవత్సరంకు రూ.800కోట్లకు పైబడి సింగ రేణి సంస్థ చెల్లిస్తూ వస్తున్నది.

## రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఐపీఎస్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో చైర్మన్, ప్రిన్సిపాల్

సుల్తానాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఇండియన్ పబ్లిక్ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కృష్ణప్రియ తెలిపారు. పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల కరీంనగర్‌లో జరిగిన షూటింగ్ బాల్ అసోసియేషన్ పోటీల్లో విద్యార్థులు నిఖిల్, అద్వైత్, అక్షిత్, సాయిచరణ్, ప్రియదర్శిని, లికిత, గాయత్రి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, శివ, సతీష్, మమత పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్ విద్యార్థులకు బ్యూటీషియన్ శిక్షణ

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బ్యూటీపార్లర్లలో కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాల మోడల్ స్కూల్ విద్యార్థులు నైపుణ్యాభివృద్ధిలో భాగంగా సోమవారం శిక్షణను ఇప్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోచయ్య మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని అపూర్వ బ్యూటీపార్లర్లలో శిక్షణను ప్రారంభించినట్లు తెలిపారు. బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు సునీత, కోఆర్డినేటర్ సంధ్య పాల్గొన్నారు.

### ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం సీపీఆర్‌పై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎవరైనా గుండెపోటుకు గురైతే సీపీఆర్ చేయాల్సిన విధానంపై శిక్షణ ఇస్తున్నట్లు ఆసుపత్రి ట్రైనర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్ గురించి అవగాహన కలిగి ఉండాలని, కార్డియాక్ అరెస్టుకు గురైన వ్యక్తిని ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చన్నారు. జనరల్ ఫిజీషియన్ లోకేష్ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, డైరెక్టర్ అశోక్ కుమార్, మెడికవర్ వైద్యులు దీక్షిత్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీష్ పాల్గొన్నారు.

### గాయత్రి విద్యానికేతన్‌లో ఉచిత వైద్యశిబిరం

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): గాయత్రి విద్యానికేతన్‌లో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆరోగ్య పరిరక్షణపై ప్రతీ ఒక్కరు శ్రద్ధ తీసుకోవాలని, విధి నిర్వాణలో మానసిక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. తరుచుగా పరీక్షలు చేసుకోవడం ద్వారా ఆరోగ్య సమాచారం తెలుస్తుందన్నారు. పార్వ్యాన్ మెడికేర్ ఆసుపత్రి వారు 2డీ ఎకో, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. విరాజ్ ఆసుపత్రి వారు ఉచిత దంత పరీక్షలు చేశారు. విద్యార్థులకు శరత్ మాక్స్ విజన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. కరస్పాండెంట్ రజనీదేవి, పూదరి దత్తాగౌడ్, రాజ్ కుమార్, విష్ణుచంద్రిక, పార్వ్యాన్ మెడికేర్ ఆసుపత్రి ప్రతినిధి గణేష్ పాల్గొన్నారు.

### జాతీయ స్ఫూర్తి పురస్కారం అందుకున్న సతీష్


సతీష్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

కమాన్‌పూర్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యం, వసుంధర విజ్ఞాన వికాస మండలి వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీష్ గౌడ్ జాతీయ స్ఫూర్తి పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో సతీష్ గౌడ్ సామాజిక రంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా మదర్‌థెరిస్సా జాతీయ సేవా అవార్డును అందించారు. భాషా సాంస్కృ తిక రాష్ట్ర శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, బాలచారి, మాజీ ఎమ్మెల్యే చందర్, అధ్యక్షుడు వైద్యుల మధుకర్ అవార్డు అందజేశారు.

### సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

రామగిరి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సింగరేణి లాభాల్లో కాంట్రాక్టు కార్మికులకు వాటా కల్పించడాన్ని హర్షిస్తూ సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఆర్జీ-3 ఏరియాల్లోని అవుట్‌సోర్సింగ్, ప్రైవేట్ సెక్యూరిటీగార్డులు సెంట్రల్ సెక్రటరీ ఉడుత శంకర్, అధ్యక్షతన ఆర్జీ-3 సెక్రటరీ శ్రీరాముల కుమార్ పాల్గొన్నారు. సింగరేణి లాభాల వాటాలో కాంట్రాక్టు కార్మికులకు ప్రతీ ఒక్కరికి రూ. 5500 చెల్లింపుపై కృతజ్ఞతలు తెలిపారు.

### ఆహార పదార్థాల తయారీలో శుభ్రత పాటించాలి

కోల్‌సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులు ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత పాటించాలని అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్ అన్నారు. లోక్ కళ్యాణ్ మేళాలో భాగంగా సోమవారం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. వీధుల్లో విక్రయించే ఆహారం ద్వారా సంక్రమించే అనారోగ్యాలను నివారించడానికి ఎఫ్ఎస్ఎస్ఏ నిబంధనలను పాటించాలన్నారు.డీటీ నాయిని వెంకటస్వామి, మెప్మా డీఎంసీ మౌనిక, సీఓలు పాల్గొన్నారు.

### ఉద్యోగుల సమస్యల పరిష్కారం ఐఎన్టీయూసీతోనే సాధ్యం

జ్యోతినగర్,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో సాధిస్తే కొన్ని సంఘాల నాయకులు తామే సాధించినట్లు చెప్పుకుంటూ కార్మికులను మోసగిస్తున్నారని ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి ఎన్టీపీసీ ఉద్యోగుల వేతన కమిటీ సభ్యుడు బాబర్ సలీంపాషా అన్నారు. సోమవారం రాత్రి మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఐఎన్టీయూసీ సాధించిన వాటిని తామే సాధించినట్లు ప్రచారం చేసుకునే నాయకులను నమ్మవద్దని అన్నారు. పిఆర్‌పి ఐఎన్టీయూసి సాధించిందని, ఈసారి పిఆర్‌పి గతం కంటే ఎక్కువ శాతం దసరాకు ముందే లభిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఐఎన్టియూసి సంఘాన్ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు రాజేశ్వర్, కృష్ణయ్య, మాజీ నాయకులు నరసయ్య, ముక్కు సుదర్శన్ పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

పెద్దపల్లి, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. దుబ్బపల్లి గ్రామ పంచాయతీ భవనాన్ని సర్వే నెంబర్ 225లో ప్రజలకు సౌకర్యవంతంగా నిర్మించాలని దరఖాస్తు చేసుకోగా పంచాయతీరాజ్ ఇంజనీర్‌కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన సంకేత్ కుమార్ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్‌కు రాశారు. సుల్తానాబాద్ పట్టణం జవహర్ నగర్‌కు చెందిన కీర్తి సరిత దివ్యాంగుల కోటా కింద అటెండర్ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటీకి రాశారు. అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన శరన్నవరాత్రులు





మంథనిలో ప్రత్యేకాలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు, ఓదెల ఆలయంలో హారతి ఇస్తున్న అర్చకుడు, గోదావరిఖనిలో కొలువుదీరిన అమ్మవారు

మంథని, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకొనిదేవీ శరన్నవరాత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మంథనిలోని మహాలక్ష్మీ ఆలయంలో వేద పండితులు అమ్మ వారికి అఖండ దీపారాధన, పుణ్యాహవచనం, కలశ స్థాపనం, నాథబ్రాహ్మ సప్తాహ దీక్షతో శరన్నవరాత్రోత్సవాలకు అంకురార్పణ చేశారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు నిరంతరాయంగా భజన చేయడం ఇక్కడి ప్రత్యేకత. ఆలయ సమీపంలోని పెద్ద పోచమ్మ తల్లి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనారాయణ స్వామి, వాసవీనగర్, గాంధీచౌక్, తమ్మ చెరువు కట్ట, ఎరుకల గూడెం, పోచమ్మవాడల్లో దుర్గాదేవి విగ్రహాలను భక్తులు ప్రతిష్ఠించారు. పలువురు దీక్షలను స్వీకరించారు. కన్యకాపరమేశ్వరి, లలితాంబిక ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

**కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, (ఆంధ్రజ్యోతి):** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో దేవీ శరన్నవ రాత్రులు ప్రారంభమయ్యాయి. డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి విగ్రహాలను మండపాలకు తరలించారు. పవర్‌హౌస్, జయదుర్గాదేవి ఆలయాల్లో భక్తులు దీక్షలు స్వీకరించారు. తొలి రోజు బాల త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చారు. జవహర్‌నగర్‌లోని జయదుర్గాదేవి ఆలయంలో మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, స్నేహలత దంపతులు పూజలు నిర్వహించారు.

**కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంతోపాటు గ్రామగ్రామాన దుర్గామాత నవరాత్రి వేడుకలు ప్రారంభించారు. వేదపండితులు అంబరీష్ శర్మ, సతీష్, సుధీర్, మహేష్, వెంకటాచారి, భాస్కర్‌లు పూజలు చేశారు.

**ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి):** ఎలిగేడుతోపాటు పలు గ్రామాల్లో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు మండపాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. భక్తులు దీక్షలు స్వీకరించారు.

**పెద్దపల్లి రూరల్/ఓదెల, (ఆంధ్రజ్యోతి):** ఓదెల మల్లికార్జున స్వామి క్షేత్రంతోపాటు పలు గ్రామాల్లో దేవి శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తిశ్రద్ధలతో గ్రామాల్లో దుర్గమాత విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో ప్రతిష్ఠించి పూజలు చేశారు. పెద్దపల్లి మండలం గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమ య్యాయి.

**పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి):** మండల వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. డప్పుచప్పుళ్ళ, ఆటాపాటలతో ఊరేగింపుగా దేవి విగ్రహాలను మండపాలలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. 15 దుర్గామాత విగ్రహాలను నెలకొల్పినట్లు ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు.

**రామగిరి, (ఆంధ్రజ్యోతి):** కల్వచర్లలో శ్రీదుర్గా యూత్ ఆధ్వర్యంలో ఉత్సవాన్ని ప్రారంభించారు. అమ్మవారి వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య ఘనం గా పూజలు చేపట్టారు. విగ్రహ దాతలు ఐతం కుమార్, కురుమల్ల కుమార్, వేముల శ్రీనివాస్, బూస అజయ్‌పటేల్, వరాల హరీష్, రేండ్ల కుమారస్వామి దంపతులు అన్నదానం చేపట్టారు.

# పండుగలకు కట్టుదిట్టమైన భద్రత

కోల్‌సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో బతుకమ్మ, దుర్గామాత నవ రాత్రి ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్టు సీపీ అంబర్ కిశోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గామాత ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో పెట్రోలింగ్, విజుబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ భద్రత కల్పిస్తామని, మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సద్దుల బతుకమ్మ రోజు అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, వేడుకల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెలవుల్లో ఊరికివెళితే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

### భద్రత ఏర్పాట్లను పరిశీలన

గోదావరిఖని పట్టణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను సోమవారం రాత్రి ఏసీపీ మడత రమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి సందర్శించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇద్దరు నిర్వాహకులు మండపంలో రాత్రి పూట ఉండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. మండపాల వద్ద నిరంతరం బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది చెక్ చేస్తారని, పాయింట్ బుక్‌లు ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రశాంతంగా నవరాత్రులు జరుపుకోవాలని సూచించారు.

### సేవా పక్వాడ్ అభియాన్

పాలకుర్తి,సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుక్కలగూడూర్‌లో సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు మేర్గు నరేష్ ఆధ్వర్యంలో అన్నదాత అభినందన యాత్ర జరిగింది. నియోజకవర్గం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి మాట్లాడుతూ మోదీ జన్మదినం పురస్కరించుకొని అక్టోబరు 2 వరకు కొనసాగనున్న సేవా పక్వాడ్ అభియాన్‌లో భాగంగా కార్యక్రమం చేపట్టామన్నారు. రైతుని రాజుని చెయ్యడమే నరేంద్రమోదీ లక్ష్యమన్నారు. మాజీ ఎంపీటీసి రాయమల్లు, నాయకులు గోపు రామన్న, కొమురె లక్ష్మణ్, కంకటి శ్రీనివాస్, తిరుపతి, కుమార్, రావుల చిన్నయ్య, శంకరయ్య, పాల్గొన్నారు.

## పెన్షన్ల పెంపు అమలు చేయాలి


కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న పెన్షన్‌దారులు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు కాంగ్రెస్ ప్రభుత్వం హామీ మేరకు పెన్షన్లను వెంటనే పెంచాలని సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పలు గ్రామాల కార్యదర్శులకు పెన్షన్‌దారులు వినతిపత్రాలు అందజేశారు. కాల్వశ్రీరాంపూర్, అంకంపల్లి గ్రామపంచాయతీల ఎదుట పెన్షన్‌దారులు ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్, వీహెచ్‌ఎస్ మండల అధ్యక్షుడు రామ్మూర్తి, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): వికలాంగులకు పెన్షన్లు పెంచాలని కనగర్తి, జీలకుంట, నాంసానిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శులకు వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాలను సమర్పించారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి రాసపల్లి రవికుమార్, అలాగే తోట ఉమామహేశ్వరి, బంగారి శ్రీనివాస్, గాడిచర్ల కొమురయ్య పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో అంబరాన్నింటిన బతుకమ్మ సంబరాలు


బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి

సుల్తానాబాద్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తెలంగాణ బతుకమ్మకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించిందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం అల్ఫోర్స్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకమైనదని, తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఆనందంగా గడుపుతారన్నారు. దీంతో వారి మధ్య స్నేహ సంబంధాలు బలపడుతాయన్నారు. అనంతరం జమ్మిపూజతో పాటు రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలిపేందుకు అల్ఫోర్స్‌లో వేడుకలను నిర్వహిస్తామన్నారు. బతుకమ్మ ఆటను మహిళలు, పిల్లలు పాల్గొని సంతోషంగా గడిపారు. వారితోపాటు నరేందర్ రెడ్డి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఉత్సాహపరిచారు. చీరలతో తయారు చేసిన బతుకమ్మ ఆకర్షణగా నిలిచింది. ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవ అలవర్చుకోవాలి


గౌరెడ్డిపేటలో ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌డీవో

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవ అలవర్చుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని అన్నారు. గౌరెడ్డిపేటలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో చేపడుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని సందర్శించారు. విద్యార్థులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు, గ్రామాల్లో చేపట్టిన సర్వే, స్వచ్ఛత తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు భవిష్యత్‌పై ఆలోచించాలని, మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నరహరి, కార్యదర్శి తిరుపతి, అధ్యాపకులు ప్రసూన, శ్రీలత, పుష్పలత, అశోక్, కుమారస్వామి పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని అన్నారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా గౌరెడ్డిపేటలో ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ ఆవరణలో మిత్ర సురక్ష శిబిరంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యదర్శి తిరుపతి, పల్లె దవాఖాన వైద్యురాలు సింధూష, మహిళ సంఘాల సిఏలు పాల్గొన్నారు.

### ఎన్‌సీసీతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు



ఎన్‌సీసీ కల్నల్‌ను సత్కరిస్తున్న మనోహర్ రెడ్డి

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేశ సేవపై అంకితభావంతో యువత, ఎన్‌సీసీ క్యాడెట్లు నడుచుకోవాలని ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. ట్రినిటి డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్‌సీసీ సబ్ యూనిట్ రేసింగ్ డేలో మాట్లాడారు. లెఫ్టినెంట్ కల్నల్ ఏకే జయంత, సుబేదార్ మేజర్ సాగర్ సింగ్ పాల్గొన్నారు. క్యాడెట్లలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశసేవపై అంకితభావంపై ప్రసంగించారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, దేశభక్తి విశిష్ట గుణాలు అలవడుతాయన్నారు. క్యాడెట్లు నిర్వహించిన పరేడ్, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రధానాధిపతులను సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ సీతూరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ రామచందర్ పాల్గొన్నారు.

### జీఎస్టీ తగ్గింపుపై సంబరాలు

కళ్యాణ్‌నగర్/ధర్మారం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువులపై జీఎస్‌టీ తగ్గించడాన్ని హర్షిస్తూ గోదావరిఖని చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కోమళ్ల మహేష్, భూమయ్య, సంజీవ్, అపర్ణ, కోడూరి రమేష్, పవన్, పాల్గొన్నారు. ధర్మారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మోదీ చిత్రపటానికి పూలమాల వేసి క్షీరాభిషేకం చేశారు. శ్రీనివాస్, లక్ష్మన్, కొలిపాక మణికంఠ, గోనే సాయిక్రిష్ణ, దేవి రాజలింగు, తిరుపతిరెడ్డి, లడ్డు, నాడెం మల్లేశం, పాల్గొన్నారు.